సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 28 । జూన్ । 2024



ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడ వీధిలో ప్రదర్శించిన భక్త ప్రహ్లాద నాటకం ఆకట్టుకుంది. - 10లో



జెన్‌కోకు అప్పగించాలి

థర్మల్ పవర్‌హౌజ్ నిర్మాణాన్ని జెన్‌కోకు అప్పగించాలని విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. -10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 30° / 25°

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రబాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ

చిలుకూరు: కౌలు రైతులకు రైతు భరోసా వర్తింపజేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. గురువారం చిలుకూరులో జరిగిన కౌలు రైతుల మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2011 కౌలుదారు చట్టాన్ని అనుసరించి కౌలు రైతులను గుర్తించాలని కోరారు. ఎలాంటి కటాఫ్ తేదీలు లేకుండా ఒక్క సారే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 14 రకాల పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు నిబంధనల ప్రకారం లేవని, స్వామి నాథన్ కమిటీ సూచనల ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ముక్కా వీరబాబు, రాంశెట్టి కోటయ్య, నాయకులు కొండా వెంకయ్య, పిల్లుట్ల కనకారావు, బెల్లంకొండ నాగయ్య, ప్రభాకర్, రవీందర్ రెడ్డి, మాతంగి ప్రసాద్, భుజంగరావు, శ్రీను, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో భక్తుల ఆరాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాలకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని అర్హులైన చేనేత కళాకారులు జూలై 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31, 2023 నాటికి 30 సంవత్సరాలు నిండి చేనేత వృత్తిలో ఐదేళ్ల అనుభవం ఉన్న వారు, జూలై 8, 2023 నాటికి 25 సంవత్సరాలు నిండి చేనేత డిజైనర్ల వృత్తిలో ఐదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9912183164 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నెగ్గేనా.. వీగేనా!

నేడు డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

- ప్రత్యేక సమావేశానికి అధికారుల ఏర్పాట్లు
- 14 మంది డైరెక్టర్లు తమ వెంట ఉన్నారంటున్న కుంభం శ్రీనివాసరెడ్డి
- అవిశ్వాసం వీగిపోతుందంటున్న గొంగిడి మహేందర్‌రెడ్డి
- తీవ్ర ఉత్కంఠ రేపుతున్న డీసీసీబీ వ్యవహారం



డీసీసీబీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గుతుందా? వీగుతుందా? తేలే సమయం వచ్చేసింది. శుక్రవారం అవిశ్వాస సమావేశం నిర్వహించేందుకు జిల్లా సహకార అధికారి చర్యలు చేపట్టారు. బ్యాంకు సమావేశ మందిరంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ అవిశ్వాసంలో తాము నెగ్గుతామని కాంగ్రెస్‌కు చెందిన మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాసరెడ్డి వర్గం ధీమాతో ఉండగా, అవిశ్వాసం వీగిపోయేందుకు సరిపడా బలం తమకు ఉందని, తమ పార్టీ డైరెక్టర్లు తమతో కలిసివస్తారని బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రస్తుత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి వర్గం పేర్కొంటోంది.

కాంగ్రెస్‌కు పెరిగిన డైరెక్టర్ల సంఖ్య

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత డీసీసీబీలో కాంగ్రెస్ బలం పెరిగింది. గతంలో బ్యాంకులో కాంగ్రెస్ పార్టీ తరపున డైరెక్టర్‌గా ఒక్క కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఉండగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో 8 మంది డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ బలం 9కి చేరుకుంది. డీసీసీబీ వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి కూడా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బ్యాంకులో మొత్తం 19 మంది డైరెక్టర్లు ఉండగా, కాంగ్రెస్ పార్టీ బలం 10కి పెరిగింది.

నెగ్గేదెవరు.. తగ్గేదెవరు?

అవిశ్వాసం ప్రవేశపెట్టిన కుంభం శ్రీనివాస్‌రెడ్డి వర్గం తమ వద్ద కోరానికి సరిపడ డైరెక్టర్లు ఉన్నారని, తద్వారా అవిశ్వాసం నెగ్గుతుందన్న పూర్తి ధీమాలో ఉంది. దీనికి అవసరమైన ప్రత్యేక కార్యాచరణను ఇప్పటికే రూపొందించుకుంది. అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన 9 మందితోపాటు కుంభం శ్రీనివాసరెడ్డిని కలుపుకొని 10 మంది ఉన్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు డైరెక్టర్లు శ్రీనివాసరెడ్డికే అనుకూలంగా ఉన్నారు. ప్రస్తుతం వారు కూడా క్యాంపులోనే ఉన్నారు. దీంతో మొత్తంగా కాంగ్రెస్ బలం 15కు చేరుకుంది. అవిశ్వాసం నెగ్గాలంటే కచ్చితంగా 14 మంది మద్దతు తెలపాల్సి ఉంటుంది. ప్రస్తుతం తమ వద్ద 15 మంది ఉన్నందున అవిశ్వాసం నెగ్గుతుందనే ధీమాలో వారు ఉన్నారు. ఇక అవిశ్వాసం వీగిపోవాలంటే 19 మందిలో ఆరుగురు గైర్హాజరు కావాల్సి ఉంది. ప్రస్తుతం డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ తరపున గెలిచిన డైరెక్టర్లు ముగ్గురు ఆయనతోపాటే ఉన్నారు. ప్రస్తుతం శ్రీనివాసరెడ్డి శిబిరంలో ఉన్న వారిలో బీఆర్‌ఎస్ తరపున గెలిచిన వారు ఉన్నారని, వారిని తమ వైపు రావాలని కోరినట్లు మహేందర్‌రెడ్డి వర్గం చెబుతోంది. క్యాంపునకు వెళ్లినా.. కొందరు తమతో టచ్‌లో ఉన్నందున, నలుగురితోపాటు మరో ఇద్దరు ముగ్గురు సమావేశానికి గైర్హాజరు అవుతారని, అవిశ్వాసం వీగిపోతుందని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అవిశ్వాసానికి ఎంత మంది హాజరవుతారన్న ఉత్కంఠ ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్ వర్గాల్లో నెలకొంది.

17 రోజులుగా ఉత్కంఠ

డీసీసీబీ పీఠంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత చైర్మన్‌పై అవిశ్వాసానికి పావులు కదిపింది. ఈ నెల 10న చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై 14 మంది డైరెక్టర్లు జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్‌కు అవిశ్వాసం నోటీసు అందజేశారు. ఆ తరువాత కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వారంతా క్యాంపునకు తరలివెళ్లారు. క్యాంపులో ఉన్న వారంతా గురువారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల వరకు నల్లగొండలోని డీసీసీబీ కార్యాలయానికి చేరుకోనున్నట్లు సమాచారం. దీంతో అవిశ్వాసంపై ఇటు కాంగ్రెస్, అటు బీఆర్‌ఎస్ వర్గాల్లో 17 రోజులుగా ఉత్కంఠకు నేటితో తెరపడనుంది.

ఆరోగ్య గ్రామ పంచాయతీలుగా చేయడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, చిత్రంలో అధికారులు

- సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి
- వనమహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉంచాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టి ఆరోగ్య గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, మెడికల్ అధికారులతో గ్రామ పంచాయతీలపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం మొదలైనందున గ్రామాల్లో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులతో పాటు గ్రామ, మండల స్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో మందులు, టెస్టింగ్ కిట్స్, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో రోజువారీగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వాటర్‌ట్యాంక్‌ల క్లోరినేషన్ చేపట్టి వర్షం నీరు, మురుగు నీరు నిల్వను గుర్తించి బ్లీచింగ్ చల్లాలన్నారు. జీపీల ద్వారా చేసిన పనులకు చెల్లింపులు ఎకప్పటికప్పుడు జరగాలని సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ కేంద్రాలపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందాలని, కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో గుర్తించిన ప్రాంతాల్లో జూలై 1వ తేదీ నుంచి విరివిగా మొక్కలు నాటాలన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేయాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా కొత్తగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. మంచిగా పనిచేస్తే అండగా ఉంటానని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వివి అప్పారావు, డీఎఫ్ఓ సతీష్‌కుమార్, డీఆర్‌డీఓ మధుసూదన రాజు, డీపీఓ సురేష్‌కుమార్, ఏడీఎంహెచ్ఓ నిరంజన్, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం సందర్శన

కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఏ, బీ కేటగిరీకి చెందిన 1,214 వీవీ ప్యాట్ల నుంచి థర్మల్ పవర్ రోల్స్, అడ్రస్ ట్యాగుల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఈవీఎం గోదాంకు తాళం వేసి సీజ్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు, వివిధ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, గోపి, స్టాలిన్, ఆబిద్, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొలువుదీరిన నేరేడుచర్ల మార్కెట్ పాలకవర్గం

- చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి, వైస్ చైర్మన్‌గా సురేష్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

నేరేడుచర్ల : నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గం గురువారం కొలువుదీరింది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేయోభిలాషుల మధ్య మార్కెట్ కమిటీ కార్యదర్శి సన్నీ సమక్షంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బెల్లంకొండ విజయలక్ష్మినర్సింహారావు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తాళ్ల సురేష్‌రెడ్డి, డైరెక్టర్లుగా కొడాలి పట్టయ్య, యలంచెరువు బాల్‌రెడ్డి, ఎస్‌కె బాల సైదా, నల్లమల్ల రాకేష్, మచ్చ శ్రీను, అనిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, అందె రామకృష్ణ, పగిడిపాటి సైదిరెడ్డి, బాండావతు శ్రీను, దండ సంజీవరెడ్డి, పొలిశెట్టి వినయ్‌కుమార్, గుమ్మడవెల్లి సోమయ్యలు కూడా బాధ్యతలు చేపట్టారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మికి నేరేడుచర్ల, పాలకవీడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన వెంకట్‌రెడ్డి, ఎస్‌వీ సుబ్బారావు, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య, పాలకవీడు ఎంపీపీ భూక్య గోపాల్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరితసైదిరెడ్డి, మాజీ సర్పంచ్ మాలోతు మోతిలాల్‌నాయక్‌లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, బైరెడ్డి జితేందర్ రెడ్డి, సోమప్ప దేవాలయం కమిటీ చైర్మన్ చిత్తలూరు సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టా రామారావు, తాళ్ల రామకృష్ణారెడ్డి, కరణం పాండయ్య, సప్పిడి నాగిరెడ్డి, కట్టా కృష్ణారావు, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నాగరాజు, రవి, వీరయ్య, తాళ్ల వెంకట్‌రెడ్డి, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, కట్టా గణేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీను, లీలామానుష్‌రెడ్డి, తాళ్ల రవీందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రావు, గుంటూరు శ్రీను పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : హుజూర్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి తాత్కాలికంగా గెస్ట్‌లెక్చరర్ల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు ఎం భీమార్జున రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ విభాగంలో 1 ఖాళీ ఉందని దానికి పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పీహెచ్‌డీ నెట్, సెట్, బోధనానుభవం కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని ఆయన తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 5 వ తేదీ లోపు కళాశాల కార్యాలయంలో నేరుగా అందజేయాలని కోరారు.

బాధ్యతగా పనిచేయాలి : డీఈఓ



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సూర్యాపేటటౌన్ : స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన భాషాపండితులు బాధ్యతగా పనిచేయాలని డీఈఓ అశోక్ సూచించారు. స్కూల్‌అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందిన బాషా పండితులు గురువారం డీఈఓ కార్యాలయంలో డీఈఓను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన భాషాపండితులు మాట్లాడుతూ దశాబ్దాల డిమాండ్లను నెరవేర్చిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హర్షవర్ధన్ రెడ్డి, జగదీష్, నరసింహలకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు ఎస్ఏలుగా పదోన్నతి రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు తాటికొండ రామమూర్తి, ముత్తినేని కోటేశ్వరరావు, చిట్యాల ప్రదీప్ కుమార్, రాచకొండ ప్రభాకర్, కె.శ్రీనివాస్, రమాదేవి లింగయ్య, సైదులు, సత్యనారాయణ, చంద్రశేఖర్, బాలశ్రీ పాల్గొన్నారు.

పంటల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి



నెమ్మికల్‌లో మన గ్రోమోర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : జిల్లాలో వానాకాలం సాగు మొదలైనందున వ్యవసాయ విస్తరణ అధికారులు పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) జి.శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో పంటల నమోదును పరిశీలించి మాట్లాడారు. రైతులు పండిస్తున్న వరి, పత్తి, పెసర, ఇతర పంటల వివరాలను సర్వే నంబర్ల వారీగా సేకరించాలని, పంట వేసిన తేదీ, నీటి వసతి వంటి వివరాలు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న మన గ్రోమోర్ షాపును తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, వ్యవసాయ శాఖ ఆమోదం పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. విత్తన దుకాణదారులు ఇచ్చిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయండి

- కాంగ్రెస్ కౌన్సిలర్ల డిమాండ్
- వాడీవేడిగా సూర్యాపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అవినీతి జరిగిందని, దీనిపై విచారణ చేయాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట మున్సిపాలిటీ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అధ్యక్షత నిర్వహించారు. ఈ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఇందులో పలువురు కౌన్సిలర్లు సమస్యలను లేవనెత్తారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్‌ను అవమానించే రీతిలో మాట్లాడారంటూ కాంగ్రెస్ కౌన్సిలర్లు పోడియం ముందు నిరసనకు దిగారు. దీంతో గందరగోళ వాతావరణం నెలకొంది. వారికి మున్సిపల్ కమిషనర్ సర్దిచెప్పడంతో శాంతించారు. అనంతరం 62 అంశాలపై చర్చించారు.

మున్సిపాలిటీలో రూ.100 కోట్ల అవినీతి..

సూర్యాపేట మున్సిపాలిటీలో పదేళ్లలో రూ.100కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు కొండపల్లి నిఖిల, ఎడ్ల గంగాభవాని, అన్నెపర్తి రాజేష్ ఆరోపించారు. కౌన్సిల్ సమావేశం బయటకు వచ్చి వారు విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా జరిగిన అవినీతిని కాంగ్రెస్ కౌన్సిలర్ల ప్రశ్నించడం తప్పా అని పేర్కొన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో హరితహారంలో రూ.15 కోట్లు, రోడ్ల నాణ్యత లోపంతో పాటు డివైడర్ల వంటి పనుల్లో సుమారు రూ.10కోట్ల అవినీతి జరిగిందని వారు ఆరోపించారు. పాత మున్సిపల్ కార్యాలయానికి మరో రూ.30 లక్షలు, నూతన కలెక్టరేట్ రోడ్డుకు రూ.20 లక్షలు కేటాయించి అవినీతికి పాల్పడ్డారని పేర్కొన్నారు. కేవలం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 17 మంది కౌన్సిలర్లకే పట్టణ ప్రగతి నిధులు రూ.5 లక్షల చొప్పున కేటాయించారని గుర్తుచేశారు. బాలెంలలో డంపింగ్ యార్డు విషయంలో 35 లక్షల రూపాయలు, రోడ్ల పనుల్లో రూ.10కోట్లు, హరితహారంలో 10 కోట్ల రూపాయల అవినీతి జరిగిందని తాము ప్రశ్నించినందుకే నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. అవినీతిని ప్రశ్నించినందుకే తమ 31 మంది కౌన్సిలర్లకు పట్టణ ప్రగతి నిధులు రూ.5లక్షల చొప్పున కేటాయించలేదని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో పారిశుద్ధ్య పనులతో ఇతర పనులకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి రూ.3. 35 కోట్లు నిధులు కేటాయించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు.



సూర్యాపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించాల్సిందే..

- సీఎంఆర్ బకాయిదారులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించవద్దని హైకోర్టును ఆశ్రయించిన కోదాడ మిల్లర్
- విచారణ సందర్భంగా మిల్లర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి



కోదాడ: సీఎంఆర్ అప్పగించడంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు ఎన్నిమార్లు చెప్పినా కేసులు పెట్టినా పట్టించుకోవడంలేదు. కేసుల నుంచి తప్పించుకోవడానికి కోర్టు మెట్లు ఎక్కిన ఓ మిల్లర్‌పై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాల్సిందే అంటూ జడ్జి వ్యాఖ్యానించారు. దీంతో మిల్లర్లలో గుబులు మొదలైంది.

అసలు విషయం ఏమిటంటే..

కోదాడకు చెందిన శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండ్రస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ యజమాన్యం 2022–23, 2023–24 సీజన్‌లకు సంబంధించి ప్రభుత్వానికి భారీగా సీఎంఆర్ బకాయి పడింది. దీనిపై విచారణ జరిపిన అధికారులు మిల్లర్ రూ. 64 కోట్ల మేర ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు తేల్చారు. మిల్లు యాజమాన్యంపై జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ కేసులో తమను అరెస్ట్ చేయవద్దని హైకోర్టు నుంచి మిల్లు యజమానులు ఉత్తర్వులు తెచ్చుకోవడంతో కేసు నమోదై రెండు నెలలు కావొస్తున్నా వారిని పోలీసులు అరెస్ట్ చేయలేదు. ఈలోగా సీఎంఆర్ బకాయిల వసూలుకు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ గత నెల 27న నోటీస్ నంబర్ డి/446/2024 తేది 27–05–24న రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద సదరు మిల్లు యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. దీనిపై సదరు మిల్లు యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. తమపై ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించకుండా చూడాలని న్యాయస్థానంలో 16138/24, 16162/24, 16167/24 నంబర్లతో మూడు రిట్ పిటిషన్లను దాఖలు చేయగా అవి బుధవారం విచారణకు వచ్చాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి పై వ్యాఖ్యలు చేయడంతో ఇపుడు జిల్లా వ్యాప్తంగా సీఎంఆర్ బకాయిలున్న మిల్లర్లలో గుబులు మొదలైంది.

> ‘నాతో సహా ప్రజలు కట్టిన పన్నుల డబ్బులతో ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొనుగోలు చేసి మర ఆడించి బియ్యం ఇవ్వమని మిల్లర్లకు ఇస్తే సంవత్సరాల తరబడి బియ్యం ఇవ్వకుండా కాలయాపన చేయడం ఏమిటి..? బకాయిల వసూలుకు బరాబర్‌గా రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించాల్సిందే. మిల్లర్ల నుంచి రూ.10 వేల కోట్ల బకాయిలు రాబట్టాల్సిందే. అవసరమైతే చివరి అస్త్రంగా ఏసీబీని కూడా రంగంలోకి దించుతాం..’ అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డి బుధవారం ఘాటుగా వ్యాఖ్యానించారు.

భారీగా బకాయిలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగు సీజన్లకు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ బియ్యం పలువురు మిలర్లు ప్రభుత్వానికి భారీగా బకాయి పడ్డారు. బకాయిల వసూళ్ల కోసం అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా మిల్లర్లు పట్టించుకోవడం లేదు. 2023–24 యాసంగి సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కనీసం 50 శాతం కూడా బియ్యం మిల్ల ర్లు ఇవ్వలేక పోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బకాయిలున్న 16 మంది మిల్లర్లకు 2023–24 యాసంగి సీజన్‌లో ధాన్యం కేటాయింపులు జరపలేదు. 9 మంది మిల్లర్లపై కేసులు నమోదు చేశారు. సూర్యాపేట జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిని అరెస్ట్ చేసి జైలుకు పంపినా మిల్లర్లలో మాత్రం భయం కలగడం లేదు. కేసులు పెట్టుకోమని పలువురు మిల్లర్లు బహిరంగంగానే చెప్పడం గమనార్హం.

అధికారుల్లో కదలిక

సీఎంఆర్ బకాయిల విషయంలో హైకోర్టు న్యాయమూర్తి బుధవారం చేసిన వ్యాఖ్యలతో అధికారుల్లో వణుకు ప్రారంభమైంది. మిల్లర్లతో పాటు బకాయిలు పేరుకుపోవడం వెనుక అధికారుల పాత్రపై కూడా విచారణ జరపడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించడంతో అధికారులు గురువారం జిల్లా వ్యాప్తంగా మరోసారి మిల్లర్లపై ఒత్తిడి తేవడం ప్రారంభించారు.

> **ఆర్‌ఆర్ యాక్ట్ కింద మొదటి నోటీస్ జారీ చేశాం**
>
> కోదాడలో శ్రీ వెంకటేశ్వర రైస్ ఇండ్రస్టీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు దాని మేనేజింగ్ డైరెక్టర్ సిలా సత్యనారాయణ, మరో అరుగురు భాగస్వాములకు ఆర్‌ఆర్ యాక్ట్ కింద గత నెల 27న మొదటి నోటీస్ జారీ చేశాం. త్వరలో రెండవ నోటీస్ కూడ జారీ చేస్తాం. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను వడ్డీతో సహా వసూలు చేస్తాం.
>
> – సీహెచ్. సూర్యానారాయణ, ఆర్డీఓ కోదాడ

క్లుప్తంగా

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నల్లగొండక్రైం: ఆర్థిక ఇబ్బందులతో గుళికల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ ప్రాంతానికి చెందిన జాకీర్ అలీ(44) పానగల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పాన్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాలతో బుధవారం రాత్రి ఇంట్లో గుళికల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని నల్లగొండ జిల్లా కేంద్రం ఆస్పత్రి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య సీమ సిరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

- కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం గుర్తింపు

ఖమ్మంక్రైం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యే చేసుకోగా మూడు రోజుల అనంతరం కుళ్లిపోయిన స్థితిలో ఆయన మృతదేహాన్ని గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ వెల్లడించిన వివరాలు.. సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వుకు చెందిన కడారి అప్పారావు(40) ఖమ్మం సుందరయ్యనగర్‌కు చెందిన రేణుకను వివాహం చేసుకుని వ్యవసాయ మార్కెట్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. పత్తి మార్కెట్ వెనక ప్రాంతంలో భార్య ,ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తుండగా అప్పారావు తరచూ మద్యం సేవిస్తుండటంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దమనుషులు సర్దిచెప్పినా ఫలితం లేకపోగా మూడు రోజుల క్రితం భార్యతో గొడవపడడడంతో ఆమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. అయితే, గురువారం ఉదయం ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు రేణుకకు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి చూసేసరికి అప్పారావు మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మూడు రోజుల క్రితమే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తుండగా, పోలీసులు చేరుకుని అన్నం ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

బ్యూటీషియన్ శిక్షణ విజయవంతం

'సాక్షి' మైత్రి మహిళ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ

- సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ సౌజన్యంతో నిర్వహణ



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సాక్షి నల్లగొండ బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్ తదితరులు

రామగిరి(నల్లగొండ): చిన్న శుభకార్యం నుంచి వివాహ వేడుకల వరకు నలుగురిలో ప్రత్యేకంగా కనిపించేందుకు మహిళలు ఆరాట పడుతుంటారు. అందుకు పదిరోజుల ముందు నుంచే దగ్గరలోని బ్యూటీపార్లర్‌కు వెళ్తుంటారు. అయితే ప్రతి మహిళ సొంతంగా బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవాలంటే ఖర్చుతో పాటు సమయం ఆదా అవుతుంది. అలాగే ఉపాధి సైతం పొందవచ్చు. అలాంటి మహిళల కోసం «సాక్షి» మైత్రి మహిళ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు అవకాశం కల్పించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ సహకారంతో నెల రోజుల పాటు ఫేషియల్ మేకప్, మానిక్యూర్, పెడిక్యూర్, హెయిర్ స్టైల్, శారీ డ్రేపింగ్, హెయిర్ అండ్ స్కిన్ కేర్‌పై మహిళలు, యువతులకు శిక్షణ ఇచ్చారు. కార్పొరేట్ బ్యూటీపార్లర్లకు ఏమాత్రం తీసిపోని విధంగా సాక్షి మైత్రి మహిళ, సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ సంయుక్త ఆధ్వర్యంలో అందించిన శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమంలో సాక్షి నల్లగొండ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ కందికట్ల రుక్మాధర్, సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు గడగోజు కవిత శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలు, యువతులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సాక్షి బ్రాంచ్ మేనేజర్ రుక్మాధర్ మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఎదగడానికి, వారిని వివిధ రంగాల్లో ప్రోత్సహించడంలో సాక్షి ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కంది భజరంగ్ ప్రసాద్, నాగేశ్వర్‌రావు, యాడ్స్ మేనేజర్ జంజిరాల వెంకన్న, జర్నలిస్ట్ వెంకట్ తుమ్మనగోటి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాకు కృతజ్ఞతలు



'సాక్షి' మైత్రి మహిళలకు ఎంతగానో ఉపయోగపడే మంచి కార్యక్రమం. మహిళలు ఎంతో ఇష్టపడే బ్యూటీషియన్ శిక్షణతో ప్రయోజనాలున్నాయి. మమ్మల్ని ఇందులో భాగస్వాములను చేసినందుకు సాక్షి మీడియాకు కృతజ్ఞతలు. సాక్షి ఇచ్చిన స్ఫూర్తితో తక్కువ ఖర్చుతో ప్రతి మహిళకు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. శిక్షణలో పాల్గొన్న మహిళలకు అన్ని రకాల మెళకువలు నేర్పించాం. సాక్షి అందిస్తున్న అవకాశాన్ని వినియోగించుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారు.

– గడగోజు కవిత, సాహితీ హెర్బల్ బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు

శిక్షణతో ఉపాధి అవకాశాలు



నెల రోజుల పాటు మేము తీసుకున్న శిక్షణతో సొంతంగా బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందగలమనే నమ్మకం వచ్చింది. ప్రతిరోజు నిర్వాహకులు మంచి శిక్షణ అందించారు. సాక్షి పత్రికలో ప్రకటన చూడగానే బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ పొందాలనే ఆసక్తి ఏర్పడింది. వెంటనే సాక్షిని సంప్రదించి శిక్షణలో చేరాను. – కె. స్వాతి

ఇంట్లోనే మేకప్ వేసుకోవచ్చు



గతంలో సాధారణ మేకప్‌తోనే సరిపెట్టుకునేవాళ్లం. అందంగా కన్పించాలంటే ఇప్పటి వరకు బ్యూటీపార్లర్ వెళ్లాం. ఇక నుంచి సొంతంగా మాకు మేము మేకప్ వేసుకోగలము. ఇంటి వద్దే మాకున్న తక్కువ సమయంలో అందంగా తయారుకావడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది. సాక్షి మైత్రి మహిళ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు సంతోషంగా ఉంది. – వి. శిల్ప

అవగాహన వచ్చింది



మహిళలు అందంగా కనిపించేందుకు మేకప్ అవసరం. మేము పార్టీవేర్, బ్రైడల్, నార్మల్ మేకప్స్‌తో పాటు వివిధ రకాల మేకప్‌లను సులువుగా చేయడం ఎలాగో ఈ శిక్షణ ద్వారా తెలుసుకున్నాం. – ఐ. సంపూర్ణ

ఇతరులకు ఉపాధి కల్పిస్తాం



సాక్షి దినపత్రికలో ప్రకటన చూసి శిక్షణ తరగతులకు వచ్చాం. నెల రోజుల పాటు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాక ప్రాక్టికల్‌గా మాతో మేకప్ చేయించి మెళకువలు నేర్పించారు. బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకుని, ఇతరులకు సైతం ఉపాధి చూపే ఆత్మస్థైర్యాన్ని శిక్షణ తరగతుల ద్వారా నిర్వాహకులు అందించారు. – బి. రాజేశ్వరీ

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



అనూష

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. ఎస్ఐ జూ కూరి సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన అనంతుల అనూష ఈ నెల 23వ తేదీ రాత్రి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి 2గంటల సమయంలో ఆమె భర్త విజయ్‌కుమార్ లేచి చూడగా అనూష కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం భర్త విజయ్‌కుమార్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మోత్కూర్: మండలంలోని పాలడుగు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. వలిగొండ మండలం ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన మాసంపల్లి పరశురాం బైక్‌పై వెళ్తూ మోత్కూర్ మండలం పాలడుగు గ్రామ సమీపంలో ఎన్‌హెచ్–930 నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన బారికేడ్స్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన పరశురాం అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడు బట్టల దుకాణంలో పనిచేస్తాడని, అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది.

వ్యాపారంలో ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నాంపల్లి మండల కేంద్రంలోని ఉప్పరిగూడెం గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన చాపల సైదులు(28) కేతేపల్లి మండలంలోని విజయ డెయిరీ కంపెనీ నుంచి పాల వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం సైదులు నాంపల్లి మండలం ఉప్పరిగూడెం గ్రామంలోని తన చిన్నమ్మ ఇంటికి వచ్చాడు. ఇటీవల పాల వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సైదులు మనస్తాపానికి గురై తన చిన్నమ్మ వ్యవసాయ బావి వద్ద గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో అతడిని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ఏరియా ఆస్పతరికి తరలించారు. మృతుడి తల్లి చాపల యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అనంతగిరి: మామిడికాయల కోసం తోటకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటన అనంతగిరి మండల పరిధిలోని యసంతాపురం గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. యసంతాపురం(తెల్లబండ తండా) గ్రామానికి చెందిన బానోతు సోమ్లా (50) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం అతడు గ్రామ సమీపంలోని ఓ మామిడి తోటలో మామిడి కాయల కోసం వెళ్లగా.. తోట చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌కు విద్యుత్ వైర్ తగిలి ఉండడంతో అది గమనించని సోమ్లా ఫెన్సింగ్‌కు పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిఇ తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి పెద్ద కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పల్లె వెలుగు బస్సుకు తప్పిన ప్రమాదం

- రోడ్డుపై బంకమట్టి ఉండడంతో జారిన బస్సు



రోడ్డుకు అడ్డంగా తిరిగిన పల్లె వెలుగు బస్సు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెం వద్ద గురువారం పల్లె వెలుగు బస్సుకు ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ నుండి చింత్రిర్యాలకు ప్రయాణికులతో వెళ్తున్న పల్లె వెలుగు బస్సు శోభనాద్రిగూడెం సమీపంలో రోడ్డుపై బంక మట్టి ఉండడంతో జారి పక్కనే ఉన్న కంప చెట్లలోకి వెళ్లబోయింది. బస్సు డ్రైవర్ బ్రేక్ వేయడంతో రోడ్డుకు అడ్డంగా బస్సు ఆగడంతో బస్సులోని ఇరవై మంది ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మట్టి తోలే వాహనాల నుంచి రోడ్డుపై పడిన మట్టి వర్షానికి తడిసి టైర్లు జారడంతో ప్రమాదానికి జరిగినట్లు ప్రయాణికులు చెబుతున్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం



నాగేంద్ర కుమార్ (ఫైల్)

మునగాల(కోదాడ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలంలోని మాధవరం శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానిక ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తుమ్మల సోమలక్ష్మి కుమారుడు నాగేంద్రకుమార్(22) సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు. అతడి తండ్రి గతంలోనే మృతిచెందాడు. సోమలక్ష్మి అనారోగ్యానికి గురికావడంతో గురువారం మునగాలలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వచ్చింది. తల్లిని చూసేందుకు నాగేంద్రకుమార్ బైక్‌పై సూర్యాపేట నుంచి మునగాలకు వెళ్తుండగా.. మార్గమధ్యలో మాధవరం గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేంద్రకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నాగేంద్రకుమార్ కుటుంబ సభ్యులు హుటాహుటిన సూర్యాపేట చేరుకుని మెరుగైన వైద్యం కోసం హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో నాగేంద్రకుమార్ తల్లి సోమలక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపించింది. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీడీ యాక్ట్ నమోదు

వలిగొండ: బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్న వలిగొండ మండలం వేములకొండ గ్రామానికి చెందిన వేముల నరేందర్‌పై రాచకొండ సీపీ తరుణ్ జోషి ఆదేశాల మేరకు గురువారం పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు. స్థానిక కాంట్రాక్టర్లు, ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో పాటు మహిళలను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్న నరేందర్‌పై గతంలో మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ పేర్కొన్నారు. అతడిపై పీడీ యాక్ట్ నమోదు చేసి నల్లగొండ సబ్ జైలు నుంచి హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలో గురువారం ఐదుగురు గంజాయి విక్రయదారులను పోలీసులు అరెస్ట్ చేశారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని నార్కట్‌పల్లి–అద్దంకి బైపాస్ రోడ్డు వై జంక్షన్ దగ్గర్లోని పవన్ మోటార్స్ వెనుక గల నిర్మానుష్య ప్రదేశంలో గురువారం మిర్యాలగూడ టూటౌన్ సీఐ నాగార్జున తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా కొందరు వ్యక్తులు వారిని చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల మున్సిపాలిటీకి చెందిన బత్తుల కుమారి, మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన చలసాని కోటేశ్వర్‌రావు, సంపత్ అశోక్, ఇందిరమ్మ కాలనీకి చెందిన నేనావత్ అశోక్, నల్లగొండ పట్టణం గొల్లగూడకు చెందిన మహ్మద్ షంషేర్ అలియాస్ సూఫియాన్ గంజాయి విక్రయిస్తున్నట్టు గుర్తించి అరెస్ట్ చేశారు. వారి నుంచి 2 కిలోల 100 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్, రూ.2వేల నగదుతో మత్తు మందు టాబెట్లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు మూడు కేసుల్లో 23మంది గంజాయి విక్రయదారులను అరెస్ట్ చేశామని డీఎస్పీ రాజశేఖరరాజు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ నాగార్జున, ఎస్ఐలు క్రిష్ణయ్య, రాంబాబు, కానిస్టేబుళ్లు కళ్యాణ్, బాలకృష్ణ, ధనుంజయ, రాగ్యానాయక్, అక్బర్‌పాషా, రామకృష్ణ, శ్రీనివాస్‌ను డీఎస్పీ అభినందించారు. ఆయన వెంట మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు తదితరులున్నారు.

ఓగోడు గ్రామంలో విషాదఛాయలు



నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు



ఆస్పత్రి బయట విలపిస్తున్న మృతుల బంధువులు

- విద్యుదాఘాతంతో మామ, అల్లుడు మృతి
- పెద్ద దిక్కును కోల్పోవడంతో కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

నకిరేకల్: విద్యుదాఘాతంతో మామఅల్లుళ్లు మృతిచెందడంతో నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మాద వీరేందర్(35) గురువారం రాత్రి తన ఇంటి ఆవరణలో దండెం తీగపై టవల్ తీసుకునేందుకు వెళ్లగా.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో పక్కనే ఉన్న తన భార్య పావని కేకలు వేసింది. ఈ కేకలు విన్న పక్క ఇంట్లోనే ఉంటున్న అతడి మేనమామ భూపతి జానయ్య(42) పరుగున వచ్చి వీరేందర్‌ను కాపాడే ప్రయత్నం చేయగా.. అతడు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇరువురిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే వారు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వీరేందర్‌కు భార్య పావని, ఇద్దరు కుమారులు ఉన్నారు. కల్లు గీత పనితో పాటు తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న జానయ్యకు కూడా భార్య ఉపేంద్ర, ఇద్దరు కూమారులు ఉన్నారు. రెండు కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నకిరేకల్ ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలను చూసి గ్రామస్తులు, బంధువులు బోరున విలపించారు.

పెసర సాగుకు అనువైన సమయమిదే

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు

పాడి పంట



పెసర పంట

నడిగూడెం: వానాకాలంలో సాగు చేసే అపరాలలో పెసర ముఖ్యమైన పంట. ఈ పంట సాగుకు అనువైన సమయమిదే అని, ఈ పంటను సాగు చేసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు. పెసర సాగులో సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

నేలలు: తేమను పట్టి ఉంచే అన్ని రకాల భూములలో పెసర పంట సాగు చేసుకోవచ్చు. చౌడు నేలలు, మురుగు నీరు నిలిచే నేలలు ఈ పంట సాగుకు పనికిరావు.

రకాలు: ఎమ్.జి.జి.–295, డబ్ల్యూ.జి.జి.–37, టి.ఎం.–96–2, ఎం.జి.జి. 347 (మధిర పెసర), ఎం.జి.జి.348 (భద్రాద్రి), ఎం.జి.జి.–351(శ్రీరామ), డబ్ల్యూ.జి.జి.–42 (యాదాద్రి) తదితర రకాలు సాగు చేసుకునేందుకు అనుకూలం. పంట కాలం 60 నుంచి 65 రోజులలో పూర్తవుతుంది.

విత్తన మోతాదు: 6–8 కిలోల విత్తనం ఒక ఎకరానికి సరిపోతుంది. మూడు కాలాల్లో విత్తుకోవచ్చు.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 5 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ లేదా 5 గ్రాములు థయోమిధాక్సామ్ లేదా 5 మి.లీ. మోనోక్రోటోఫాస్‌ను కలిపి విత్తనశుద్ధి చేసినట్లయితే సుమారు 15 నుంచి 20 రోజుల వరకు రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చు. మొదటిసారి పంటను సాగు చేసేటప్పుడు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించాలి. 200 గ్రాములు రైజోబియం కల్చర్ ఎకరానికి సరిపడా విత్తనానికి బాగా కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. మొదట శిలీంధ్రనాశిని మందుతో శుద్ధి చేసి, ఆరబెట్టిన తర్వాత రైజోబియంను పట్టించాలి.

రసాయ ఎరువులు: ఎకరానికి 8కిలోలు నత్రజని, 20 కిలోలు భాస్వరం ఇచ్చే ఎరువులు, ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. అనగా 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ సాస్ఫేట్ లేదా 50 కిలోల డీఏపీని వాడాలి. వరి తర్వాత మాగాణుల్లో విత్తుకున్నప్పుడు ఎరువులు వేయడం వీలుపడదు. అవసరం మేరకే పోషకాలను పైపాటుగా పిచికారీ ద్వారా అందించాలి. భూసార పరీక్ష ఆధారంగా సిఫార్సు మేరకు రసాయన ఎరువులను వాడాలి.

విత్తే దూరం: వానాకాలం మరియు యాసంగిలో సాళ్ల పద్ధతిలో ఆరుతడి పంటగా విత్తినప్పుడు సాలుకు సాలుకు మధ్య 30 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. వేసవిలో ఆరుతడి పంటగా విత్తుకొనేటప్పుడు సాలుకు సాలుకు 22.5 సెం.మీ. దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.

విత్తే పద్ధతి: నాగలితో లేదా కల్టివేటర్‌తో ఒకసారి, ఆ తర్వాత గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేసి, విత్తుటకు సిద్ధం చేసుకోవాలి. సాళ్ల పద్ధతిలో నాగలి లేదా గొర్రుతో విత్తుకోవాలి. యాంత్రికంగా ట్రాక్టర్ కల్టివేటర్ లేదా సీడ్ డ్రిల్ కమ్ ఫర్టిలైజర్‌తో బోదె కాలువల పద్ధతిలో కూడా విత్తుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం: సేంద్రియ ఎరువులైతే చివరి దుక్కిలో ఎకరానికి రెండు టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి. ముందు పంట మోళ్లను రోటోవేటర్‌తో భూమిలో కలియదున్నాలి. జీవన ఎరువులైతే రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించి ఉపయోగించాలి. 100 లీటర్ల నీటిలో 10 గ్రాముల పంచదార లేదా బెల్లం లేదా గంజి పొడరును కలిపి 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. చల్లారిన ద్రావణం 8కిలోల విత్తనాలపై చల్లి దానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టూ పొరలా ఏర్పడేటట్లు జాగ్రత్త వహించాలి. ఈ ప్రక్రియను పాలిథిన్ సంచులను ఉపయోగించి చేసుకోవాలి. రైజోబియం పట్టించిన విత్తనాన్ని నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి. ఎకరానికి 2 కిలోల ఫాస్ఫోబ్యాక్టర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువులో కలిపి దుక్కిలోగాని, విత్తనం విత్తేటప్పుడుగాని సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. ఈ ఎరువు భూమిలోని మొక్కలు లభ్యంకాని రూపంలో ఉన్న భాస్వరం లభ్యమవుతుంది.

పంట దిగుబడి : ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5 నుంచి 6 క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుంది.

అంతర పంటలు : కంది, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలను పెసరను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు.